క్లుప్తంగా

26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు మిషన్ సభ్యులు తెలిపారు.సాయంత్రం 4 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయనిచెప్పారు. బాలకృష్ణుడికి పూజ, భజన, చిన్ని కృష్ణుల వేషధారణలో ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాసం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేడు ఆర్‌యూలో ప్లాంటేషన్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు 'అమ్మ పేరిట మొక్క' కార్యక్రమం కింద మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేసినట్లు వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు తెలిపారు. వర్సిటీలోని సైన్స్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్లాంటేషన్ కార్యక్రమంలో అన్ని విభాగాల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అతిథులుగా పాల్గొననున్నట్లు వెల్లడించారు.

కొత్త చట్టాలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నల్లప్ప

కర్నూలు(సెంట్రల్):ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేసే నూతన నేర చట్టాలను రద్దు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం బుధవారపేటలోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2023లో భారతీయ న్యాయ సంహిత, భారతీయ న్యాయ సురక్ష, భారతీయ సాక్ష్య అధినయం పేరుతో నూతన నేర చట్టాలు అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. భారతీయ న్యాయ సురక్ష సంహిత పేరుతో తెచ్చిన చట్టంలో ఫిర్యాదు చేసిన 14 రోజుల వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోయినా ఇబ్బంది లేనట్లుగా పేర్కొన్నారని చెప్పారు. ఫలితంగా దళిత, గిరిజనులపై దాడులు జరిగితే అన్ని రోజుల వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. నూతన నేర చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎండీ ఆనందబాబు, విజయమ్మ పాల్గొన్నారు.

సోలార్ పవర్ గ్రిడ్‌కు అనుసంధానం



సోలార్ పవర్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్న ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు, ఇంజినీర్ల అసోషియేషన్ గెస్ట్ హౌస్‌పై నెలకొల్పిన సోలార్ ప్యానల్స్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. శుక్రవారం కర్నూలులోని ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ గెస్ట్‌హౌస్‌పై 15 కిలోవాట్ల సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయడాన్ని బిల్డింగ్ కమిటీ చైర్మన్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ కింద సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోందని తెలిపారు.గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి దోహదపడుతుందని వివరించారు. విద్యుత్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పునరుద్ధరణ పనులు పూర్తిచేయాలి

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ పునరుద్ధరణ పనులను రెండురోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్ పరిసరాలను పరిశీలించారు. కలెక్టరేట్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. పునరుద్ధరణ పనులను రెండు రోజుల్లో పూర్తి చేసే లా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కార్మికుల భద్రతపై అవగాహన

కర్నూలు (టౌన్): పరిశ్రమల్లో కార్మికుల భద్రతపై అవగాహన కల్పించాలని ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. శుక్రవారం నగర శివారులోని లక్ష్మీపురంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఎల్.పి.జి. బాట్లింగ్ కర్మాగారం ఆవరణలో వర్క్ పర్మిట్ సిస్టమ్– పరిమిత ప్రదేశాలలో పని భద్రతపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల భద్రతపై 1948 ఫ్యాక్టరీల చట్టం, 1950 ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల నియమావళిని పాటించాలన్నారు. గతేడాది జులైలో ప్రభుత్వం పరిమిత ప్రదేశాలలో ప్రమాదాలను నివారించేందుకు మార్గదర్శకాలు అమలు చేసిందన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని వివిధ కర్మాగారాల నుంచి 100 మంది సాంకేతిక నిపుణులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే భద్రతా నిపుణులు పార్థసారథి, సేఫ్టీ ఆఫీసర్ వీరేష్‌బాబు వీడియో చిత్రాల ద్వారా శిక్షణా తరగతులతో పాటు ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు.

అత్యవసర విభాగాల వద్ద సెక్యూరిటీ పెంచాలి



కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, గైనకాలజీ, పీడియాట్రిక్, కార్డియాలజీ ఐసీయూ వంటి అత్యవసర విభాగాల వద్ద ప్రస్తుతమున్న సెక్యూరిటీని మరింత పెంచాలి. చికిత్స కోసం వచ్చిన వ్యక్తి మరణిస్తే కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే గొడవలు జరుగుతున్నాయి. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే చికిత్సా సమయంలోనే రోగి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. ప్రస్తుతం ఇది టీచింగ్ కరిక్యులమ్‌లో లేదు. ఇకపై చేర్చాలి. ఈ విధానం జాతీయ స్థాయిలో అమలైతే రాష్ట్రంలోనూ అమలవుతుంది. వైద్యులు, సిబ్బందికి డ్రెస్‌కోడ్, ఐడీ కార్డు తప్పనిసరి చేయాలి. దీనివల్ల అపరిచిత వ్యక్తులు ఎవరు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారో తెలుస్తుంది.

– డాక్టర్ పి.చంద్రశేఖర్, రిటైర్డ్ కేఎంసీ ప్రిన్సిపాల్

పీజీ సీట్లకు అనుగుణంగా వసతులు కల్పించాలి



కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో పీజీ సీట్లు పెరిగినా అందుకు తగ్గట్లు వసతులు, సౌకర్యాలు కల్పించలేదు. వైద్య విద్యార్థులకు ఆరు నెలలకు ఒకసారి స్టైఫండ్ ఇస్తున్నారు. దీనివల్ల వారు సొంతంగా వసతులు, సౌకర్యాల కోసం చేతి నుంచి ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వారు అత్యవసర విభాగాల్లో 36 నుంచి 38 గంటలు ఏకదాటిగా పనిచేస్తున్నా అవసరమైన రెస్ట్‌రూమ్స్, బాత్‌రూమ్స్ లేవు. వాటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం, అధికారులకు చెబుతున్నా అవసరమైన నిధులు సమకూర్చడం లేదు. క్యాజువాలిటీకి రోగులు ఎంతో ఆతృత, ఆందోళనతో వస్తారు. ఇలాంటి సమయంలో రోగి మరణిస్తే వెంటనే వారికి కనిపించేది జూనియర్ డాక్టర్లే. వారితో గొడవ పడటం, దాడికి దిగడం చేస్తుంటారు. ఇలాంటి సమయంలో అవసరమైన సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి, కర్నూలు

గ్రామ సభలతో అభివృద్ధికి బాటలు

కర్నూలు సిటీ: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో జరిగిన గ్రామ సభలో కలెక్టర్‌తో పాటు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గార్గేయపురం సభలో ప్రజలు లేవనెత్తిన డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేయాలని సూచించారు. నిధులు మంజూరయ్యాక ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామంలో 1950 కుటుంబాలు ఉన్నాయని 920 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉండగా, జల్‌జీవన్ మిషన్ కింద మిగతా ఇళ్లకు కొత్త కుళాయి కనెక్షన్లు ఇస్తామని, 500 ఇళ్లకు టాయిలెట్లు లేవని వీరికి స్వచ్ఛ భారత్ కింద మంజూరు చేస్తామని, 600 మందికి గ్యాస్ కనెక్షన్లు లేవని వీరందరికి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ సభలో 3 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించేందుకు వినతులు వచ్చాయని, వీటి నిర్మాణాల కోసం అంచనాలు రూపొందించాలని ఇంజినీర్లను ఆదేశించారు. అలాగే వీధి దీపాల ఏర్పాటు, రూ.4.67 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, శ్మశాన వాటికకు కాంపౌండ్ వాల్, అప్రోచ్ రోడ్డు, స్కూల్‌కు కాంపౌండ్, అంగన్‌వాడీ, పశువైద్యశాల ఏర్పాటుకు గ్రామసభలో తీర్మానాలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు పార్లమెంటు పరిధిలో ఆర్.ఓ.ఆర్, అడంగల్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని రెవెన్యూ అధికారులు వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ నిధులు మంజూరైతే గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ.. నియోజకవర్గానికి రెండు నెలల్లోనే రూ.8 కోట్ల నిధులు కేటాయించారని, ఒక్కో మండలానికి రూ.2 కోట్లు మంజూరు చేశామన్నారు. పల్లెల్లో ఏళ్లతరబడి నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వక్ఫ్ భూములను పరిరక్షిస్తామని హామీఇచ్చారు. అనంతరం టంగుటూరి ప్రకాశం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ సోమేశ్వరమ్మ, డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, తహసీల్దారు రమేష్‌బాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, పాల్గొన్న కర్నూలు ఎంపీ, కోడుమూరు ఎమ్మెల్యే

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కర్నూలు సిటీ: గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అక్కడి డాక్టర్లకు సూచించారు. ప్రతి రోజు పీహెచ్‌సీకి ఎన్ని ఓపీలు వస్తున్నాయని, ఎన్ని ప్రసవాలు జరుగుతాయని, పీహెచ్‌సీలో గ్లూకోమీటర్లు ఉన్నాయా? గర్భిణులకు ప్రసవం తరువాత అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహం గురించి ఆరా తీశారు. ల్యాబ్, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. అనంతరం జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు, చిక్కీల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. రాత్రి వేళల్లో స్కూల్ ఆవరణలోకి ఇతరులు ప్రవేశించి మద్యం తాగి ఇబ్బందులు కలగజేస్తున్నారని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రోజూ రాత్రి పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసులకు సూచించారు. మధ్యాహ్న భోజనం తయారుచేసేందుకు షెడ్డు నిర్మించాలని హెచ్‌ఎం కోరగా సానుకూలంగా స్పందించారు. అలాగే హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జయలక్ష్మి, హేమలత, తహసీల్దారు రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



గార్గేయపురం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

ఉర్దూ వర్సిటీలో బీఏ హానర్స్ కోర్సు

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో బీఏ హానర్స్ స్పెషల్ ఉర్దూ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ్ శుక్రవారం తెలిపారు. కోర్సులో చేరెందుకు ఇంటర్మీడియెట్, మదరసా బోర్డు ద్వారా ఇంటర్ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఇతర వివరాలువర్సిటీవెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

25లోగా వెబ్‌ఆప్షన్స్ నమోదు చేసుకోవాలి

యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో చేరేందుకు ఓఏఎండీసీ పోర్టల్ ద్వారా ఫేజ్– 2 కింద కళాశాల ఎంపికకు వెబ్ ఆప్షన్స్‌ను ఈనెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలని రిజిస్ట్రార్ తెలిపారు. యూనివర్సిటీలో బీఏ ఉర్దూ హానర్స్, బీఏ ఎకనామిక్స్ హానర్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ హానర్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా ఓఏఎండీసీ పోర్టల్ https://oamdc-apsche.aptonline.in/OAMDC202425/Index లో తమ వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఏహెచ్‌యూయూ 30715ను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈనెల 29వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుందని, 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీలోగా విద్యార్థులు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అదే రోజు నుంచి కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన



కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కోల్‌కతాలో యువ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా కర్నూలు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం మహిళా విభాగం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టింది. కర్నూలు గాయత్రీ ఎస్టేటులోని యూనియన్ బ్యాంక్ బుధవార పేట శాఖ ఎదుట మహిళా ఉద్యోగులు నిరసన చేపట్టి హత్యాచారానికి పాల్పడిన నేరస్తులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం కన్వీనర్ పద్మావతి మాట్లాడారు. ఏపీ యూనియన్ బ్యాంకు ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి శివకృష్ణ, ముఖ్య సలహాదారుడు నాగరాజు, ఉప ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కర్నూలు(సెంట్రల్): మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు పలు అంశాలపై ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ కో–ఆర్డినేటర్ అమీర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రైనింగ్‌లో కంప్యూటర్ బేసిక్స్, రెజ్యూమ్ ప్రిపరేషన్, స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఇంటర్వ్యూ స్కిల్స్, జాబ్స్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌లో తర్ఫీదు ఇచ్చి రిటైల్ సేల్స్ అండ్ మార్కెటింగ్, బీపీఓ, కాల్‌సెంటర్, ఐటీ సర్వీసెస్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫైనాన్స్, లాజిస్టిక్ సెక్టార్లలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. 60 రోజుల శిక్షణ అనంతరం ఎన్ఐఐటీ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 1 గంట వరకు తరగతులు ఉంటాయన్నారు. 18 – 25 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫొటోతో కర్నూలు కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలని, వివరాలకు 95739 36050, 87121 39065 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఫెన్సింగ్ క్రీడలో రాణించాలి

కర్నూలు (టౌన్): ఫెన్సింగ్ క్రీడలో రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఔట్ డోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్, ఖోఖో, ఫెన్సింగ్ వంటి క్రీడాంశాల్లో అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్, న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నేటి పోటీలు: నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శనివారం బాస్కెట్‌బాల్, ఖోఖో, హాకీ, స్కేటింగ్, సెపక్‌తక్రా, వెయిట్ లిఫ్టింగ్, యోగా క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు వెల్లడించారు.

మాదక ద్రవ్యాలపై 14500కు సమాచారం ఇవ్వండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్

కర్నూలు: జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాలు ఎక్కడైనా ఉన్నట్లు కచ్చితమైన సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులు లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 14500కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్, ఒకటవ పట్టణ సీఐ రామయ్య నాయుడు విజ్ఞప్తి చేశారు. ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు పాతబస్తీలోని వాసవి కళాశాలలో పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐలు రాజేంద్రప్రసాద్, రామయ్య నాయుడు హాజరై యువత భవిష్యత్తును మంచిగా మార్చుకోవాలంటే అనుసరించాల్సిన అంశాలపై వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. బాల్య వివాహాల అనర్థాలు, పోక్సో చట్టం, డ్రగ్స్ వినియోగం వల్ల దుష్పరిణామాలు, సమస్యలు తలెత్తినప్పుడు డయల్ 100కు సమాచారమివ్వడం తదితర అంశాలను వివరించారు. ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు చదువులను పూర్తి చేసి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. ఆకతాయిల నుంచి ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, నకిలీ ఫోన్ కాల్స్, నకిలీ మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దని సూచించారు. తల్లిదండ్రులు ఎంతో ఉన్నతాశయంతో చదివిస్తున్నారని, వారి ఆశయాలను వమ్ము చేయకుండా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

సర్వీసు రోడ్డులో గుంతలను పూడ్చాలి



గుంతలను చూపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని ఓబులయ్య నగర్ సర్వీసు రోడ్డులో పడిన గుంతలను పూడ్చాలని డీవైఎఫ్ఐ న్యూసిటీ కార్యదర్శి హుస్సేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం గుంతలు పడిన ప్రాంతాన్ని డీవైఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు సర్వీసు రోడ్డులో గుంతలు పడ్డాయన్నారు. ఫలితంగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చాలని కోరారు. నాయకులు ఇమ్రాన్, శివశంకర్, నయిమ్, భాస్కర్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



మాట్లాడుతున్న ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జహనారా

కర్నూలు కల్చరల్: అంతరిక్ష పరిశోధనల్లో భారత దేశం చరిత్ర సృష్టిస్తుందని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జహనారా ఆకాంక్షించారు. శుక్రవారం ఆ వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతికి ఇచ్చిన సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అంతరిక్షంలో భారతదేశం సాధించిన విజయాలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించారన్నారు. చంద్రయాన్–3 నుంచి విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా చంద్రుడిపైకి చేరి ఏడాది పూర్తయిన సందర్భంగా తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. చంద్రుడిపై విజయవంతంగా దిగిన నాల్గవ దేశంగాను, చంద్రుడి దక్షిణ ధృవ ప్రాంతానికి చేరుకున్న మొదటి దేశంగా అవతరించడం ద్వారా భారత్ సృష్టించిందన్నారు. ఈ ఏడాది జాతీయ అంతరిక్ష దినోత్సవం థీమ్ 'టచింగ్ లైవ్స్ వైల్ టచింగ్ ది మూన్: ఇండియాస్ స్పేస్ సాగా' అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పాల్ కృపాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వల నిర్మాణ ప్రతిపాదనలకు ఆదేశం



శ్రీరామ్‌నగర్ ప్రధాన రహదారిపైకి చేరిన మురుగును పరిశీలిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నగరంలో సమస్యాత్మకంగా ఉన్న మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక 23వ వార్డు శ్రీరామనగర్‌లో వార్డు ఇన్‌చార్జ్ కటారి సురేష్‌కుమార్ మురుగు నీటి సమస్యను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మేయర్ సి.క్యాంపు ప్రధాన రహదారి వద్ద రోడ్డుపై పారుతున్న మురుగును పరిశీలించారు. మురుగు కాల్వలు దెబ్బతినడంతో మురుగు నీరు రోడ్డెక్కింది. సిబ్బందిని అప్రమత్తం చేసి వెంటనే పనులు చేయించారు. డీఈఈ కృష్ణలతతో మేయర్ మాట్లాడారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. పక్కనున్న క్వార్టర్స్ నుంచి నీరు ఊట రూపంలో వస్తోందని, తాత్కాలికంగా గుంత తవ్వితే సమస్య పరిష్కారం అవుతుందని డీఈఈ వివరించారు. శాశ్వతంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్ ఆదేశించారు.

ఇమ్యునైజేషన్ సెంటర్ తనిఖీ



సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఐ హరిహరతేజ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా కేంద్రంలో ఉన్న ప్రాంతీయ ఇమ్యునైజేషన్ సెంటర్‌ను శుక్రవారం కర్నూలు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హరిహరతేజ తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్‌కు సంబంధించి వ్యాక్సిన్ స్టోర్స్, ఫ్రీజర్లు, అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ల గురించి ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు కూడా ఇక్కడి నుంచే వ్యాక్సిన్ సరఫరా అవుతుందని సిబ్బంది వివరించారు. వ్యాక్సినేషన్‌కు సంబంధించి మొత్తం ఏఏ పరికరాలు, వ్యాక్సిన్ కూలర్లు, వ్యాక్సినేటర్ వివరాలు, వ్యాక్సిన్ వివరాలు తీసుకున్నారు.

ఆంధ్రకేసరికి నివాళి



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు వారికి ముచ్చెమటలు పట్టించిన ఘనత ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం దక్కుతుందని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు సేవలను స్మరించుకున్నారు. నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, షేక్ జిలానీ బాషా, అనంతరత్నం తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: తెలుగు జాతి గర్వించదగిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ప్రకాశం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఆచార్యులు సీవీ కృష్ణారెడ్డి, ఎన్.నరసింహులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కర్నూలు కల్చరల్: మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. సి.క్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం జనవిజ్ఞాన వేదిక, సమత, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళల హక్కులపై చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్య అత్యంత క్రూరమైందన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐద్వా నాయకురాలు నిర్మలమ్మ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియా, జేవీవీ నాయకులు సురేష్, శేషాద్రి రెడ్డి మాట్లాడారు. మహిళలకు స్వేచ్ఛా స్వయం ప్రతిపత్తి కావాలన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి స్త్రీ స్వేచ్ఛ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను నిరోధించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రేణుకమ్మ ఆధ్వర్యంలో కోల్‌కతలో పీజీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో నిత్యం మహిళలపై దాడులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశా రు. వైద్యుల రక్షణకు చట్టాలు తీసుకురావాలని, నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బాల దుర్గమ్మ, నరసింహులు, రాముడు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని విజయవనం రిజర్వ్ ఫారెస్ట్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకున్నట్లు డీఎఫ్ఓ సూర్యచంద్ర రాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాక్టర్ల ఓనర్లు అంబేడ్కర్ నగర్‌కు చెందిన కల్యాణ్‌కుమార్, వెంగన్న బావికి చెందిన షేక్ మదార్‌లపై కేసులు నమోదు చేశామన్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.34 వేల చొప్పున రూ.68 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డీఎస్ ప్రసాద్, ఫారెస్టర్ మౌలాలి, బీట్ ఆఫీసర్ లక్ష్మీబాయి, ప్రొటెక్షన్ వాచర్స్ మధు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దపడఖానలో కురవ శేఖర్ (45) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యతో ఈయన కొన్నేళ్ల క్రితం విడిపోయి తాగుడుకు బానిసయ్యాడు. మద్యం మత్తులో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.